క్లుప్తంగా

'అపార్' నమోదు వేగవంతం చేయండి



అపార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదును వేగవంతం చేయాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. స్థానిక పట్టణంలోని భాష్యం పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన.. అక్కడ జరుగుతున్న అపార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థుల వివరాల నమోదు మందకొడిగా ఆ పాఠశాలలో కొనసాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన అపార్ నమోదు పూర్తి చేయాలని తెలిపారు.

నిత్యావసర సరుకుల అందజేత

వంగర: మండలంలో కొప్పరవలస గ్రామంలో నిరుపేదలైన ఐదు కుటుంబాల వారికి సత్యసాయి సేవా కమిటీ సభ్యులు నెలకు సరిపడ నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. నవంబరు నెలకు సరిపడ 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు ఆయిల్, కిలో బంగాళాదుంపలు, కారం, పసుపు, పేస్ట్, సబ్బులు వంటి సరుకులు అందించారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు సాదెం వెంకటరమణ, మజ్జి రాజబాబు, సాదెం కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

రాజాం సిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించుకోవాలని, ఆమె గెలుపుతోనే విద్యారంగ పరిరక్షణ సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై, కాసేపు మాట్లాడారు. పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వ్యక్తిగత చైతన్యాన్ని సంఘ చైతన్యంగా మార్చుకోవాలని, సంఘ చైతన్యాన్నే సామాజిక చైతన్యంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పక్కి వాసు, రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్రపట్నాయక్, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న సిబ్బంది, రైతులు

బాడంగి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దారు కె.సుధాకర్ తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని ఈ సదస్సుల్లో సరిదిద్దుతామన్నారు. తప్పుల సవరణకు సంబంధించి, రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు వివిధ భూ సమస్యల పరిష్కారానికి 43 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు వెంకటరమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడు, వీఆర్వో వెంకటస్వామి, గ్రామ సర్వేయరు పాల్ పాల్గొన్నారు.

చురుగ్గా గ్రావెల్ రోడ్డు పనులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గొల్లవీధి నుంచి చెరువు వరకు 500 మీటర్ల పొడవు మేర సర్పంచ్ బుడుమూరు పట్టాభి పర్యవేక్షణలో ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులతోనే ఈ రోడ్డు వేయిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, పీఆర్ జేఈ రియాజ్, పంచాయతీ కార్యదర్శి కూర్మారావు తదితరులు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించండి



కొర్లవలస ప్రాథమిక పాఠశాల సందర్శనలో ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొర్లవలస, బూరాడ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాల ప్రారంభ సమయానికే ఆయా పాఠశాలలకు వెళ్లిన ఆయన అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను చూసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లెస్సన్ ప్లాన్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన జరగాలని, రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు రాజగోపాల్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు అపార్ కష్టాలు

- ఆధార్‌లో తప్పులతో అపార్ నమోదుకు తిప్పలు
- వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ నినాదంతో పాఠశాలల్లో కార్యక్రమం
- మందకొడిగా నమోదు ప్రక్రియ
- 1 నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు రిజిస్ట్రేషన్లు
- వివరాలు సక్రమంగా లేక ఇబ్బందులు

మండలాల వారీగా అపార్ నమోదు వివరాలు

మండలం	మొత్తం విద్యార్థులు	అపార్ నమోదు పూర్తయిన వారు
రాజాం	16231 మంది	6453 మంది
రేగిడి	5644 మంది	2552 మంది
సంతకవిటి	5492 మంది	2728 మంది
వంగర	3447 మంది	1721 మంది



అపార్ కార్డు నమూనా



వాసుదేవపట్నం కేజీబీవీలో అపార్ నమోదు ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది

రాజాం: వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ నినాదంతో కేంద్ర ప్రభుత్వం.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐడీ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరిట విద్యార్థుల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించింది. తొలి విడతలో 9, 10 తరగతుల విద్యార్థుల వివరాలు సేకరించినప్పటికీ ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థు వివరాల నమోదు చేయిస్తోంది. ఈ ప్రక్రియ నిర్వహణను పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలకు అప్పగించింది. ఆధార్ ఆధారంగా ఈ నమోదు చేయాల్సి ఉండగా, ఆధార్‌లోని తప్పుల కారణంగా ప్రక్రియ చాలా మందకొడిగా జరుగుతోంది. దీంతో ఉపాధ్యాయ సిబ్బందికి అపార్ నమోదు ప్రక్రియ కష్టతరమైంది. అపార్ నమోదు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయని పలువురు వాపోతున్నారు.

50 శాతం కూడా కాలేదు..

రాజాం నియోజకవర్గంలో నెల రోజుల క్రితం ఈ అపార్ నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటివరకు 50 శాతం మేర కూడా పూర్తి కాలేదు. పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్‌లు, నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించి, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేస్తున్నారు. పలుచోట్ల విద్యార్థుల ఆధార్ కార్డుల్లో జనన నమోదు తేదీలు, విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, ఇంటి పేర్లు తప్పుగా నమోదయ్యాయి. ఇంగ్లిష్ అక్షరాల్లో ఒక్క అక్షరం తప్పుగా ఉన్నా ఈ నమోదు నిలిచిపోతోంది. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న విద్యార్థి వివరాలకు సమానంగా ఆధార్‌లోని విద్యార్థి వివరాలు సరిపోల్చి ఉండాలి. అలా కాకుంటే అపార్ నమోదు సాధ్యం కావడం లేదని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో అపార్ నమోదు సక్రమంగా చేయలేకపోతున్నామని అంటున్నారు.

ఆధార్‌లో తప్పులతో అవస్థలు..



అపార్ నమోదు చాలా వేగవంతం చేయాల్సి ఉంది. అయితే ఆధార్ కార్డుల్లో నెలకొన్న తప్పుల కారణంగా అవస్థలు పడాల్సి వస్తోంది. తొలుత ఆధార్‌లోని వివరాలు సరిచేసి, ఆ తర్వాత అపార్ నమోదు చేయాల్సి ఉంది. ఆధార్ వివరాలు సరిచేసేందుకు సమయం ఎక్కువ పడుతుండడతో ఫలితంగా అపార్ నమోదు మందకొడిగా కొనసాగుతోంది. రాజాం మండలంలో 38 శాతం మాత్రమే అపార్ నమోదు జరిగింది.

– బి.ప్రవీణ్‌కుమార్, ఎంఈవో, రాజాం

జనన తేదీల్లో తేడాలు..

పలుచోట్ల ఆధార్ కార్డుల్లో ఉన్న జనన తేదీలు, ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న జనన తేదీలు తప్పుగా ఉన్నాయి. వాటిని తొలుత ఆధార్ కార్డుల్లో సరిచేయాల్సి వస్తోంది. ఆధార్ సెంటర్‌లలో డిజిటల్ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ ఉంటేనే తేదీ మార్పు జరుగుతోంది. 2014కి ముందు పుట్టిన విద్యార్థులకు డిజిటల్ సర్టిఫికెట్‌లు లేవు. దీంతో విద్యార్థులు ఆర్‌డీవో కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. వారంతా పరిశీలించిన తర్వాత డిజిటల్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఈ తంతుకు నెల రోజులు వ్యవధి పడుతోంది. ఫలితంగా ఆధార్ కార్డుల్లో దిద్దుబాట్లు జరగక, ఉన్న సర్టిఫికెట్లు పనిచేయక అపార్ నమోదులో జాప్యం తప్పడం లేదు.

రక్తదానానికి ముందుకురావాలి



రక్తదాతలతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబు తదితరులు

రాజాం సిటీ: రక్తదానం చేయడానికి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకురావాలని రాజాం ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు, అమృత ఆస్పత్రి ఎండీ డాక్టర్ గార రవి ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. స్థానిక చైతన్య పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీబాయి పుట్టిన రోజు సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదాలు, ఆపరేషన్ల సమయంలో ఎంతోమంది రక్తం అందక మృత్యువాత పడుతున్నారని, అటువంటి మరణాలు సంభవించకుండా యువత రక్తదానానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా కొత్తరక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. మొత్తం 20 యూనిట్ల రక్తం సేకరించినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల రీజనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, బాలరాజు, ప్రిన్సిపాల్‌లు లక్ష్మణనాయుడు, ప్రభాకర్, హరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పరిశీలించిన తర్వాతే బిల్లులు



మాట్లాడుతున్న పీఆర్ డీఈ అప్పారావు

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం నిధులతో ప్రస్తుతం చేపడుతున్న వివిధ నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలను క్వ్యాసీ(క్వాలిటీ సెల్) టీమ్ వచ్చి పరిశీలించిన తర్వాతనే బిల్లులు చేస్తామని పీఆర్ డీఈ అప్పారావు స్పష్టం చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలోని తెర్లాం, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి పనులు చేపట్టేందుకు రూ.28 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా నిధులతో నిర్మిస్తున్న నిర్మాణాలకు వారం రోజుల వరకు వాటరింగ్ చేయాలని సూచించారు. గతంలో నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఎంబుక్ రికార్డు చేసి, బిల్లులు ఇచ్చేవారమని, ఇప్పుడు అలా కుదరదన్నారు. నాణ్యతను బట్టి బిల్లులు చేయాలన్న ప్రభుత్వ నిబంధన ఉందన్నారు. గ్రామాల్లో వెండర్ కోడ్ రిజిస్ట్రేషన్ అయిన ఖాతాలో బిల్లులు పడతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

36 దరఖాస్తులే వచ్చాయి..

బాడంగి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, ఓటుహక్కు కోసం మొత్తం 36 దరఖాస్తులే వచ్చాయని తహసీల్దారు కె.సుధాకర్ తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. దరఖాస్తు ప్రక్రియకు గడువు ముగిసిందని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఆన్‌లైన్ ద్వారా 32, ఆఫ్‌లైన్ ద్వారా 4 వచ్చాయని పేర్కొన్నారు. వాటిని తాను, ఎంఈవో పరిశీలించిన అనంతరం ఓటుహక్కు కల్పిస్తామన్నారు. కనీసం మూడేళ్ల పాటు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు అర్హులన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మంనాయుడు

బొబ్బిలి: విద్యుత్ చార్జీలు పెంపు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండడం దుర్మార్గమని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు విమర్శించారు. మండల కేంద్రంలోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే ఇప్పుడున్న చార్జీలు తగ్గిస్తామని ప్రజల్ని నమ్మబలికిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందని దుయ్యబట్టారు. ట్రూఅప్ చార్జీలంటూనే వాటికి మించి చార్జీల మోత మోగించడానికి కూటమి సర్కారు రంగం సిద్ధం చేసుకోవడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెంపుతో సామాన్య ప్రజల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విద్యుత్ చార్జీల పెంపు గుదిబండలా మారనుందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి ఎంపికపై హర్షం

బాడంగి: వైఎస్సార్ సీపీ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎంపికపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకుడు అయిన శంబంగి ఎంపిక సరైనదేనని సమర్థిస్తున్నారు. కొప్పులవెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పెద్దపీట వేసినందుకు గాను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, సలహాదారు తెంటు మధుసూదనరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, బొమ్మినాయుని రమేష్, తెర్లి శ్రీనివాసరావు, తెంటు సింహాచలం, తిరుపతిరావు, రెడ్డి కృష్ణ, బేతనపల్లి శంకరరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

హమాలీ చార్జీల చెల్లింపు

బొబ్బిలిరూరల్: మండలంలోని సీహెచ్ బొడ్డవలస, గోపాలరాయుడుపేట, కాశిందొరవలస రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు 2021–22 ఏడాదికి గాను చెల్లించాల్సిన హమాలీ చార్జీలను బుధవారం ఆయా గ్రామాల్లో చెల్లించారు. క్వింటాకు రూ.25 చొప్పున 467 ఎఫ్‌టీవోలకు సంబంధించి, మొత్తం రూ.7,34,640 అందజేశారు. మరో 65 మంది రైతులకు హమాలీ చార్జీలు ఇంకా చెల్లించాల్సి ఉందని ఎఫ్‌పీవో శ్రీరామచంద్ర తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9441062224ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో బోర్డు డైరెక్టర్ కె.సింహాచలం, సీఈవో ఎ.ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

బొబ్బిలి: స్థానిక ఐరిస్ పబ్లిక్ స్కూల్‌లో యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్)పై బుధవారం అవగాహన కల్పించారు. వైడీవో నెట్‌వర్క్ ప్రాజెక్టు మేనేజర్ ఎల్.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ బారినపడకుండా జాగ్రత్త వహించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఐవీ అనేది ఒక వైరస్ అని, విశృంఖలమైన లైంగిక సంబంధాలు, పాలు, రక్తం ద్వారా ఆ వైరస్ సోకుతుందన్నారు. ఆ వైరస్ సోకిన 5 నుంచి 10 ఏళ్లలో ఎయిడ్స్ వ్యాధి వస్తుందని వివరించారు. అయితే హెచ్ఐవీ రోగులతో స్నేహంగా ఉన్నంత మాత్రాన ఆ వ్యాధి సోకదని, వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడకూడదన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ఎవరైనా వివక్ష చూపితే టోల్‌ఫ్రీ నంబర్ 1097కు కాల్ చేయాలని సూచించారు.

మద్యం దుకాణం ఏర్పాటు ఆపండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న హ్యూమన్ రైట్స్ సభ్యుడు రామకృష్ణ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో చేస్తున్న మద్యం దుకాణం ఏర్పాటును ఆపాలని హ్యూమన్ రైట్స్ సభ్యుడు కిల్లాడ రామకృష్ణ కోరుతున్నారు. ఇదే విషయమై ఆయన తహసీల్దారు సులోచనరాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు 220 మీటర్ల పైబడి దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిబంధన ఉన్నా.. దుకాణ యజమానులు మాత్రం ఆ నిబంధనను ఉల్లంఘిస్తూ ఆరికతోటలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎంఈవోకు కూడా ఫిర్యాదు చేశామని, దుకాణం ఏర్పాటు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసుకునేలా చూడాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సీపీఎం సభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో సీపీఎం నాయకులు

బొబ్బిలిరూరల్: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎస్.గోపాల్, ఆర్.త్రినాధ, యు.ప్రసాద్‌లు కోరారు. మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ మండల నేతల సమావేశంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరిగే సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ చేపట్టాల్సిన పోరుబాటపై చర్చించారు. ప్రభుత్వాలు మారినా వారి తలరాతలు మారడం లేదని విమర్శించారు. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరల భారంతో సామాన్యుడి నడ్డి విరిగిపోతోందని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించడంలో సర్కారు మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేకూరే పనులు చేపట్టాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: గ్రామాల్లో రైతులకు ఉపయోగపడేలా పనులు గుర్తించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేతనదారులందరికీ పని కల్పించాలని, అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఎంపీడీవో పరిశీలన



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంప్‌ను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన ఆధార్ కార్డుల్లో నెలకొన్న తప్పులను సరిచేసేందుకు నిర్వహిస్తున్న ఈ శిబిరాలను మండలంలో పలుచోట్ల నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆధార్ కార్డుల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయించుకోవాలన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



వెంకంపేటలో రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి ఉమామహేశ్వరి

రేగిడి: జీడి, మామిడి రైతులంతా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఉద్యాన శాఖాధికారిణి సీహెచ్ ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని వెంకంపేట, కందిశ, తునివాడ గ్రామాల జీడి, మామిడి రైతులతో బుధవారం సమావేశమైన ఆమె వారికి పలు సూచనలు చేశారు. ఎకరా తోటకు రూ.1500 ప్రీమియం చెల్లిస్తే ఏదైనా పంటనష్టం జరిగినప్పుడు నష్టపరిహారం కింద రూ.30 వేలు అందుతుందన్నారు. దీనికి సంబంధించి, విజయనగరం జిల్లాకు ఇఫ్కో ఇన్సూరెన్స్ కంపెనీని ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. రైతులు నేరుగా బీమా సంస్థకు బీమా కట్టే అవకాశం ఉందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఈ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

పొలంగట్టు.. అదనపు ఆదాయానికి మెట్టు



నందిగాంలో వరి పొలంగట్టుపై కంది సాగు



తెర్లాంలో పొలంగట్లపై పండిస్తున్న చిక్కుడు పంట



కుసుమూరు పొలాల్లో వేసిన బీర పంట



నందబలగ పొలాల గట్లపై రైతులు సాగుచేస్తున్న బెండ పంట

నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరుగుతున్న వేళ.. రైతులు వినూత్నంగా ఆలోచన చేస్తున్నారు. ఓ వైపు పొలాల్లో వరి, చెరకు వంటి ప్రధాన పంటలు పండిస్తూనే.. మరోవైపు అవే పంటపొలాల గట్లపై కూరగాయలు సాగు చేపడుతున్నారు. చేతికి అందివచ్చిన వాటిలో కొన్నింటిని ఇంటి అవసరాల నిమిత్తం వినియోగించుకోగా, మిగిలిన వాటిని మార్కెట్‌లో విక్రయించుకుని, కొద్దోగొప్పో ఆదాయం సముపార్జిస్తున్నారు. ప్రధాన పంట ద్వారా వచ్చే ఆదాయానికి కూరగాయల అమ్మకం వల్ల వచ్చే ఆదాయం అదనపు ఆదాయంగా సమకూరుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– తెర్లాం

ఎకరాకు 30 బస్తాల ధాన్యం

రేగిడి: ఎకరా విస్తీర్ణంలో సాగు చేసే వరి పంటకు సంబంధించి, 30 బస్తాల ధాన్యం దిగుబడిగా వస్తోందని ఏవో జి.మురళీకృష్ణ అంచనా వేశారు. మండలంలోని చాటాయివలస, వండానపేట, గుళ్లపాడు తదితర గ్రామాల్లో వరి పంటను బుధవారం పరిశీలించిన ఆయన.. ఈ ఏడాది ఎక్కడ చూసినా స్వర్ణమసూరి, సాంబమసూరి, సంపత్ తదితర రకం పంటలు బాగా పండాయని, ఆశాజనకంగానే పంటల సాగు, దిగుబడి ఉన్నాయన్నారు.